
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 23 జూలై 2025



పెట్రోల్ బంకుల తనిఖీ

విజయనగరం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లను మంగళవారం వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. కాలుష్యం తగ్గించేలా చూడాలని బంకుల యజమానులకు సూచించారు. ట్యాంకుల్లో నిల్వ ఉంచిన పెట్రోల్, డీజిల్‌ను పరిశీలించారు. ట్యాంకుల్లో గాలి, నీరు స్థితిగతులను, బాత్‌రూమ్‌ల పరిస్థితిని పరిశీలించారు. తనిఖీల్లో డీఎస్‌వో మధుసూధనరావు, ఐవోసీఎల్, బీపీసీఎల్ సేల్స్ మేనేజర్లు శివకుమార్, అన్విత, లీగల్ మెట్రాలజీ ఏసీ రంగారెడ్డి తదితరులు ఉన్నారు.



గ్రీన్‌ఫీల్డ్ పార్కు కోసం సేకరించిన భూములు

ఉత్తరాపల్లికి మహర్దశ

- గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రూపు రేఖలు మారుతున్న గ్రామం
- 150 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో పార్కు
- దేశంలో ఇప్పటి వరకు ఇలాంటి పార్కులు ఐదే

కొత్తవలస, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేతో మండలంలోని ఉత్తరాపల్లి గ్రామ రూపు రేఖలు మారబోతున్నాయి. హైవే నిర్మాణం పూర్తి కావొస్తోంది. మరోవైపు గ్రామ రెవెన్యూ భూములతో కలిపి సుమారు 150 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ పార్కు వస్తోంది. పనుల ప్రారంభానికి అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉండే అత్యాధునిక సౌకర్యాలతో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి పార్కులు మన దేశంలో ఇప్పటివరకు ఐదు మాత్రమే ఉన్నాయి. ఈ పార్కులో అత్యాధునిక వసతులు కలిగిన హోటళ్లు, విశాలమైన పార్కింగ్ స్థలాలు, పెట్రోల్ బంక్‌లు, విశ్రాంత భవనాలతో పాటు మరిన్ని అత్యాధునిక వసతులు కలిగిన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నం నుంచి చత్తీస్‌గఢ్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఈ హైవే ద్వారా విశాఖ నుంచి 6 గంటల్లోనే చత్తీస్‌గఢ్ (మిగతా 8వ పేజీలో..)







ఆరేళ్ల కిందటి ఇళ్లు..
అందని బిల్లులు

- ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎదురుచూపు
- జిల్లాలో 5,186 ఇళ్లకు రూ.15.52 కోట్లు పెండింగ్
- కొద్ది నెలల కిందట వివరాల సేకరణ
- ఇంకా కలగని మోక్షం



బిల్లుకు నోచుకోని సంతకవిటి మండలం పొడలి గ్రామానికి చెందిన ముద్దాడ లక్ష్మి

- రాజాం మండలం గురవాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.2 లక్షలకు గాను రూ.లక్ష వరకూ బిల్లులు ఖాతాలో పడ్డాయి. మిగతా బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాడు.

- వంగర మండలం కొప్పర కొత్తవలస గ్రామానికి చెందిన వ్యక్తికి 2017లో టీడీపీ ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసింది. పనులు ప్రారంభించగా పునాదులు, శ్లాబు స్థాయిలో బిల్లులు పడ్డాయి. శ్లాబు అనంతరం రూ.80 వేలకు పైగా బిల్లు రావాల్సి ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడైనా కదలిక వస్తుందన్న ఆశతో ఉన్నాడు.

రాజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని నేతలు ప్రకటించారు. ఎందుకో ఏడాది దాటుతున్నా అది కార్యరూపం దాల్చలేదు. గృహనిర్మాణ లబ్ధిదారులు ప్రభుత్వ స్పందన కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ముందు ప్రభుత్వం చేపట్టిన పథకాలను, ప్రాజెక్టులను తరువాత ప్రభుత్వాలు కొనసాగించడం ఆనవాయితీ. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఆనవాయితీకి బ్రేక్ వేసింది. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకాన్ని పూర్తిగా విస్మరించింది. 2014-19 మధ్య నిర్మించిన ఇళ్లకు రకరకాల కారణాలు చూపుతూ పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. దీంతో ఐదేళ్లు లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తిచేసుకున్న వారికి బిల్లులు చెల్లిస్తారని ఆశలు పుట్టాయి. నేతలు కూడా హామీ ఇచ్చారు. ఇంకా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో (మిగతా 8వ పేజీలో..)

ఎన్టీఆర్ ఇళ్లకు చెల్లించాల్సిన బిల్లలు ఇలా

నియోజకవర్గం	లబ్ధిదారులు	బకాయిలు
1.రాజాం	1531	రూ.4.2 కోట్లు
2.బొబ్బిలి	803	రూ.2.31కోట్లు
3.నెల్లిమర్ల	762	రూ.2.52కోట్లు
4.చీపురుపల్లి	498	రూ.1.53కోట్లు
5.విజయనగరం	192	రూ.68 లక్షలు
6.ఎస్.కోట	662	రూ.1.99 కోట్లు
7.గజపతినగరం	642	రూ.1.97కోట్లు

త్వరలోనే నిధులు

ఎన్టీఆర్ ఇళ్ల బిల్లులకు సంబంధించి జిల్లాలో సర్వే పూర్తయ్యింది. 5,186 ఇళ్లకుగాను రూ.15.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం వద్ద కూడా సమగ్ర సమాచారం ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తాం.

- శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ, విజయనగరం

బడి ఎందుకు మానేసినట్టు?

- విద్యార్థుల ఇంటికెళ్లి హెచ్‌ఎంలు తెలుసుకోండి
- తిరిగి బడిలో చేర్పించండి
- 9 వేల మంది డ్రాపౌట్లు సరికాదు
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- విద్యాశాఖ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నా ఎందుకు బడి మానేస్తున్నారని కలెక్టర్ అంబేడ్కర్ ప్రశ్నించారు. జిల్లాలో సుమారు 9 వేల మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా నమోదు కావడం సరికాదన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మండల విద్యాశాఖాధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క పదో తరగతిలోనే 850 మంది విద్యార్థులు బడిమానేయడం ఏంటని ప్రశ్నించారు. బడి మానేసిన ప్రతి విద్యార్థి ఇంటికి ప్రధానోపాధ్యాయులు వెళ్లి మాట్లాడాలని, విద్యార్థి పరిస్థితి తెలుసుకుని బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో వీలున్నంత ఎక్కువ సమయం గడపాలని, అప్పుడే విద్యార్థి మానసిక స్థితి తెలుస్తుందని చెప్పారు. వారిలో ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థ ఉపాధ్యాయులు ఉంటారని, అయితే విద్యార్థులపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ ఏడాది 10 తరగతి ఫలితాలు మెరుగ్గా (మిగతా 8వ పేజీలో..)

వారంలోగా షాపులు ఖాళీ చేయాలి 7లో

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష

కష్టాల్లో పీఏసీఎస్‌లు

- 63 సంఘాలకుగాను లాభాల్లో ఉన్నవి 11
- ఆదాయ మార్గాలు పెంచుకోవడంలో విఫలం
- కొత్త పాలక వర్గాలపైనే ఆశలు 6లో

జూట్ రైతుల కోసం పాట్ మిత్రో యాప్ 6లో

- రైతు సేవా కేంద్రాల్లో ప్రచారానికి సన్నాహాలు



బోల్తాపడిన మినీ బస్సు

అరకు ఘాట్ రోడ్డులో
మినీ బస్సు బోల్తా

- 21 మందికి గాయాలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- లోయలో పడకుండా చూసిన డ్రైవర్
- బాధితులంతా రాజమండ్రి వాసులు
- ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స





ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు మంగళవారం బోల్తా కొట్టింది. ప్రమాదంలో 21 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ కుమార్‌స్వామి చాకచక్యంతో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. బ్రేకులు ఫెయిలై లోయలో పడాల్సిన బస్సును కొండను ఢీకొట్టేలా చేయడంతో గాయాలతో బయటపడ్డామని క్షతగాత్రులు తెలిపారు. వారంతా శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డవారంతా రాజమండ్రి వాసులు. వారితో మినీ బస్సులో ప్రయాణించిన ఎస్.నాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రాజమండ్రి పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు 20 మంది వరకు రాజమండ్రి జైన్ రోడ్డులోని అడమ్ సెలూన్‌లో పనిచేస్తున్నారు. వీరంతా అరకు చూడాలనుకున్నారు. ఓ మినీ బస్సులో సోమవారం రాత్రి (మిగతా 8వ పేజీలో..)



చికిత్స పొందుతున్న డ్రైవర్ కుమార్‌స్వామి



తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు ప్రయాణం చేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

సందర్శకుల రక్షణే లక్ష్యం

- ఎస్పీ వకుల్‌జిందాల్
- తాటిపూడి వద్ద పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభం

గంట్యాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తాటిపూడి పర్యాటక ప్రాంతానికి వచ్చే సందర్శకుల రక్షణ కోసం రిజర్వాయర్ వద్ద పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్‌జిందల్ తెలిపారు. మంగళవారం తాటిపూడి వద్ద ప్రారంభ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారు ఉండడం వల్ల ఇక్కడికి సందర్శకులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారని, వారి భద్రత కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించేందుకు కూడా పోలీస్ అవుట్ పోస్టు దోహదపడుతుందన్నారు. పోలీసు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని, అలాగే ఇక్కడికి వచ్చే సందర్శకులు బోటు షికారు చేసే సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు లైఫ్ జాకెట్లు వినియోగించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేకంగా దృష్టిపెట్టామని, వాటిని తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే సైబర్ మోసాలు, మహిళల భద్రత, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళ భద్రత (మిగతా 8వ పేజీలో..)

నేను హోంమంత్రి వ్యక్తిగత సహాయకుడ్ని

- మహిళా పోలీస్‌ను బెదిరించిన వ్యక్తి
- అరెస్ట్ చేసిన పోలీసులు

విజయనగరం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): హోం మంత్రి వ్యక్తిగత సహాయకుడిగా చలామణి అవుతున్న నకిలీ వ్యక్తి అల్లూరి అరవింద్‌ను ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మహిళా పోలీస్ ఇచ్చిన ఫిర్యాదుతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నకిలీ సహాయకుడిగా నిర్ధారించుకుని అరెస్టు చేశారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ వెల్లడించారు. ఈ నెల 21న జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అల్లూరి అరవింద్ రిసెప్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ అరుణను కలిసి తాను హోం మంత్రి వంగలపూడి అనిత వ్యక్తిగత సహాయకుడిగా పరిచయం చేసుకున్నాడు. తాను ఎస్పీని అత్యవసరంగా కలవాలని కోరాడు. కానిస్టేబుల్ అరుణ స్పందిస్తూ ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు చూస్తున్నారని, కలవడానికి కొంత సమయం పడుతుందన్నారు. తాను గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని, ఎస్పీని కలవాలని, లేకుంటే 'నీ అంతుచూస్తానని' దౌర్జన్యం చేశాడు. బెదిరించడంతో కానిస్టేబుల్ అరుణ ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అరవింద్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీస్‌లు దర్యాప్తులో భాగంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన అల్లూరి అరవింద్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు.

ముఖ హాజరుతో రేషన్ ఇవ్వండి

- ఐసీడీఎస్ పీడీ విమలారాణి



కాపుశంభంలో రికార్డులను తనిఖీ చేస్తున్న పీడీ విమలారాణి

గరివిడి/ రాజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముఖ హాజరు (ఫేస్ మ్యాపింగ్)తో టీహెచ్‌ఆర్ రేషన్‌ను అందజేయాలని ఐసీడీఎస్ పీడీ విమలారాణి ఆదేశించారు. గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కాపుశంభం గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. సెంటర్‌లోని పిల్లలతో మాట్లాడారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ అనుసంధానంతో ఉన్న ఫేస్ మ్యాపింగ్‌తో రేషన్ ఇవ్వాలన్నారు. యాప్‌లో ఏమైనా సాంకేతిక లోపాలుంటే సవరించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఐసీడీఎస్ గరివిడి ప్రాజెక్ట్ సీడీపీవో ఎస్.ఆరుద్ర, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు ఉన్నారు.

కేంద్రాల బలోపేతానికి చర్యలు

ప్రతి అంగన్వాడీ కార్యకర్త నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విమలారాణి ఆదేశించారు. సూపర్‌వైజర్లు నిరంతరం (మిగతా 8వ పేజీలో..)

కష్టాల్లో పీఏసీఎస్‌లు



రాజాం పీఏసీఎస్ కార్యాలయం

- 63 సంఘాలకుగాను లాభాల్లో ఉన్నవి 11
- ఆదాయ మార్గాలు పెంపొందించడంలో విఫలం
- వైసీపీ పాలనలో డీలా
- కొత్త పాలకవర్గాల పైనే ఆశలు

రాజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కార్యవర్గాలను నియమించారు. త్రీమెన్ కమిటీల నియామకం దాదాపు పూర్తయ్యింది. అయితే చాలా సంఘాలు నష్టాలలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 63 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 2 రైతు సేవా సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో కేవలం 11 సంఘాలు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. మిగిలిన సంఘాల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. జిల్లాలో అత్యధికంగా రాజాం పీఏసీఎస్ రూ.5 కోట్ల నష్టాల్లో ఉంది. ఆ తరువాత స్థానాల్లో గాజులరేగ రూ.3.10 కోట్లు, పూసపాటిరేగ రూ.2.95 కోట్లు, సోమలింగాపురం రూ.2.28 కోట్లు, లకిడాం రూ.2.20 కోట్లు, జొన్నాడ రూ.1.95 కోట్లు, చింతాడ రూ.1.83 కోట్లు, భోగాపురం రూ.1.61 కోట్లు, తాడిగూడ పీఏసీఎస్ రూ.1.60 కోట్ల నష్టాలతో అగ్రభాగాన ఉన్నాయి. ఇప్పుడు ఇవి నష్టాలను అధిగమించి లాభాల బాటలో ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి.

ఏడేళ్లుగా ఎన్నికలు లేవు..

గత ఏడేళ్లుగా పీఏసీఎస్ పాలకవర్గాలకు ఎన్నికలు లేవు. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో ఎన్నికలు జరిగాయి. 2018తో వీరి పదవీ కాలం ముగిసింది. కానీ అప్పటికే సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో నాడు చంద్రబాబు సర్కారు పాత కార్యవర్గాలనే కొనసాగించింది. కానీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మాత్రం త్రిసభ్య కమిటీలకు తమ పార్టీ ప్రతినిధులను నామినేట్ చేసింది. అప్పటి నుంచి ఈ ఐదేళ్ల పాటు సొంత పార్టీ నేతలను నామినేట్ చేసి కాలం వెళ్లదీసింది. కనీసం ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించింది. ఒకవైపు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తూనే.. మరోవైపు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పాలనకు గాను త్రీమెన్ కమిటీలను నియమించింది.

వైసీపీ హయాంలో గాలికి..

వైసీపీ ఐదేళ్ల పాలనలో పీఏసీఎస్‌లు నిర్వీర్యమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. పీఏసీఎస్‌లకు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లలో కమీషన్ రూపంలో ఆదాయం వస్తుంది. గత ఐదేళ్లలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.25 కోట్ల కమీషన్‌ను పెండింగ్‌లో ఉంచేసింది వైసీపీ ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో గిడ్డంగి నిర్మాణానికి రూ.40 లక్షల వంతున కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వంపరంగా మ్యాచింగ్ గ్రాంట్ జత చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఒకవేళ గోదాములు నిర్వహించి ఉంటే వాటి అద్దెల రూపంలో పీఏసీఎస్‌లకు ఆదాయం సమకూరేది. కానీ ప్రభుత్వం ఆ పని కూడా చేయలేదు. కేంద్రం నిధులు ఇచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వ పరంగా నిధులు ఇవ్వలేకపోవడంతో గోదాముల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

రైతుల విముఖత..

పీఏసీఎస్‌లో సభ్యత్వం తీసుకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తొలుత ఎటువంటి రుసుం చెల్లించకుండానే రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత చెల్లించేవారు. అక్కడికి కొద్దిరోజుల తరువాత సభ్యత్వ రుసుం కింద రూ.10 వంతున వసూలు చేసి... సంఘ సభ్యులుగా చేర్చుకునేవారు. ప్రాంతీయ వ్యవసాయ కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేవారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లలో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది. ప్రభుత్వపరంగా సహకార సంఘాలకు నిధుల కేటాయింపు లేకపోవడంతో రైతులు అటువైపుగా చూడడం మానేస్తున్నారు.

బలోపేతానికి చర్యలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి రుణాల రికవరీ బాగానే జరుగుతోంది. పారదర్శక సేవల కోసం కంప్యూటరీకరణ చేస్తున్నాం. ఇక సంఘాలన్నీ ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేయాల్సిందే. సంఘాలను ఆర్థికంగా లాభాల్లోకి తెచ్చేందుకు ప్రత్యేక వ్యూహం రూపొందించాం.

-పి.రమేష్, జిల్లా సహకార శాఖ అధికారి, విజయనగరం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పైడిమాంబ దర్శనానికి భక్తుల బారులు

విజయనగరం కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం నాలుగో మంగళవారం కావడంతో వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. వేకువ జామునే ఆలయ ఆస్థాన పూజారులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పైడితల్లమ్మ భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మిఠాయి, వివిధ రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. భక్తుల రద్దీ దృష్ట్యా.. వారికి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అలంకరణలో పైడితల్లమ్మ


పుష్పాలంకరణలో ముత్యాలమ్మ

గ్రామదేవతలకు పుష్పాలంకరణ

భోగాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామ దేవతలు ముత్యాలమ్మతల్లి, తోగాలమ్మతల్లికి భక్తులు మంగళవారం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గ్రామంలో వెలసిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రతి వారం విశేష అలంకరణ, పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.


పుష్పాలంకరణలో తోగాలమ్మ


గతంలో పూడికలతో నిండిన వెంగళరాయసాగర్ కాలువ


ఇప్పుడు నీటితో కళకళలాడుతూ...

నాడు అడవిలా.. నేడు గంగలా..

- వెంగళరాయసాగర్ కాలువ రూపురేఖలు మారిన వైనం

బొబ్బిలి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇక్కడ ఉన్న రెండు చిత్రాలు చూశారా? ఒకటి చిట్టడవిని తలపిస్తోంది. మరొకటి పంట పొలాలను సస్యశ్యామలం చేసేందుకు గంగ పరుగులు తీస్తున్నట్టు ఉంది. ఈ రెండూ చూడడానికి వేర్వేరు ప్రాంతాల్లోని చిత్రాల్లా ఉన్నాయి కదూ. మరోసారి పరిశీలించండి. రెండూ ఒకేచోట తీసిన చిత్రాలు. ఒకటి అడవిని తలపిస్తూ... గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇంకొకటి ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరుకు దర్పణంలా నిలుస్తోంది. బొబ్బిలి మండలం సీహెచ్ బొడ్డవలస గ్రామం మీదుగా వెళ్తున్న వెంగళరాయ సాగర్ కాలువ ఇది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఈ కాలువను ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చొరవతో దీని రూపురేఖలు సంపూర్ణంగా మారిపోయాయి. మంగళవారం రైతులతో కలసి ఎమ్మెల్యే బేబీనాయన ఈ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తరువాత తన సొంత నిధులు రూ.10 లక్షలతో కాలువలు బాగు చేయించినట్టు చెప్పారు. పారాది, వెంగళరాయ సాగర్, తోటపల్లి కాలువలను వినియోగానికి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. గోపాలరాయుడుపేట ఛానల్ కమిటీ ఛైర్మన్ నాగిరెడ్డి రామారావు, పాత బొబ్బిలి ఛానల్ కమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి సత్యనారాయణలకు కాలువలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వెన్నెల నాగరాజు, గోపాలరాయుడుపేట రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాల సద్వినియోగంతో

ఉన్నత శిఖరాలు

- ఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కాంతం



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ఆర్ఆర్ఎల్ కాంతం

విజయనగరం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్ఆర్ఎల్ కాంతం అన్నారు. కస్పా హైస్కూల్‌లో మంగళవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... అవకాశాలను వెదుకుతూ మనమే వెళ్లాలని సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథి, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ వీఎల్ నర్సయ్య మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ప్రయత్నించాలని సూచించారు. పరీక్షల్లో మార్కుల కోసం కాకుండా, విజ్ఞానం కోసం చదవాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త చాగంటి కృష్ణకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రస్తుత విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్పా హైస్కూల్ అసిస్టెంట్ హెచ్ఎం కేపీ సతీష్ కుమార్, గణితం ఉపాధ్యాయుడు రాజు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పెద్దింటి అప్పారావు, రంగారావు దొర, ప్రతినిధులు గోపాల్, బాలు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది 23 మంది విద్యార్థినీ విద్యార్థులకు రూ.75 వేలను ప్రతిభా పురస్కారాలుగా అందించినట్టు నిర్వాహకులు తెలిపారు.

జూట్ రైతుల కోసం పాట్ మిత్రో యాప్

- రైతు సేవా కేంద్రాలలో ప్రచారానికి సన్నాహాలు
- గోగు రైతులకు ఉచితంగా సోనా పౌడర్

PAAT-MITRO
A JCI initiative for Jute farmers

బొబ్బిలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): జూట్ రైతులకు సమగ్ర సమాచారం అందించేందుకు జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'పాట్ మిత్రో యాప్'ను ప్రత్యేకంగా రూపొందించింది. ఈ యాప్ ద్వారా గోగు రైతులు విత్తనాలు, మార్కెటింగ్, ధరవరలు, తెగుళ్లు, వాటి నివారణ, నాణ్యమైన ఉత్పత్తుల తయారీ తదితర అన్ని రకాల సమాచారాన్ని నేరుగా తెలుసుకునే వెసులుబాటును కల్పించారు. ఈ యాప్‌లో ఉన్న సమాచారం ప్రకారం వివరాలివీ...

- జిల్లాలోని గోగు రైతులకు ఉచితంగా సోనా పౌడర్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ పౌడర్‌ను గోగు ఊరవేత సమయంలో వినియోగిస్తే నాణ్యతతో కూడిన దిగుబడులకు ఆస్కారం ఉంటుంది. నీటిలో ఊరిన గోగును వలిచేందుకు సులువుగా ఉంటుంది. బాక్టీరియాను కూడా నాశనం చేస్తుంది.
- జిల్లాలో గోగు పండించే గ్రామాలు కలిగిన మండలాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలలో జూట్ కమిషనర్ పంపిన లేఖలను రైతుల అవగాహన కోసం పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-నేషనల్ జూట్ బోర్డు సంయుక్తంగా గోగు పండించే రైతులకు విత్తనాలను రాయితీపై పంపిణీ చేశాయి. కిలో విత్తనాలు సబ్సిడీపై రూ.57 వంతున ఎకరాలకు మూడు కిలోల చొప్పున రైతులకు పంపిణీ చేశారు. టోసా రకం విత్తనాలతో రైతులకు అధిక దిగుబడి, నాణ్యతతో కూడిన గోగు ఉత్పత్తి జరుగుతుందని చెబుతున్నారు.
- ఈ సీజన్‌లో బాటమ్ రకం జూట్ క్వింటాలు ధర రూ.3,760, బి.బాటమ్ రకం రూ.3,660, క్రాస్‌బాటమ్ రకం జూట్ క్వింటాలు ధర రూ.3,560గా జేసీఐ నిర్ణయించింది.


రైతుల కోసం సిద్ధంగా ఉన్న పరికరాలు

విస్తీర్ణం పెంచేందుకు చర్యలు

గత ఏడాది బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలలో 15 వేల క్వింటాళ్ల గోగు ఉత్పత్తి అయింది. ఈ ఏడాది 12 వేల క్వింటాళ్ల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. రైతులను ప్రోత్సహించేందుకు రాయితీపై గోగు విత్తనాలు, ఉచితంగా సోనా పౌడర్‌ను, సీడ్ డ్రిల్లింగ్ మిషన్లను, సైకిల్ వీడర్స్‌ను సరఫరా చేస్తున్నాం. బలిజిపేట, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం, తెర్లాం, బాడంగి, రాజాం వంగర ప్రాంతాలలో మాత్రమే గోగు సాగవుతోంది. జూట్ ఉత్పత్తుల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వాలనే ప్రణాళిక ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో జూట్ బ్యాగ్‌ల కౌంటర్‌ను ప్రత్యేకించి ఏర్పాటు చేశారు.

- రామ్‌ప్రసాద్, జూనియర్ ఇన్‌స్పెక్టర్, జూట్ టెక్నాలజీ మిషన్, బొబ్బిలి



శాకంబరిగా దారగంగమ్మ

శృంగవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో వెలసిన శ్రీదారగంగమ్మ తల్లి మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి మంగళవారం కావడంతో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ పూజారి రాజా పంతులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు.

మాదక ద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్ అంధకారం

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగర శివారులోని ఇన్‌స్పైర్ పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శౌర్య పేరుతో, మహిళల భద్రత, మాదక ద్రవ్య అనర్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు సంకల్పం పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. లైంగిక నేరాల్లో చిక్కుకుంటే జీవితం అంధకారం అవుతుందన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు సీఐలు లీలారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

అగ్రిగోల్డ్ భూములను మ్యుటేషన్ చేయాలి

- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూములను మ్యుటేషన్ చేయాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని రామభద్రపురం, మెంటాడ, గజపతినగరం, విజయనగరం మండలాల్లో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భూములు రీసర్వే, భౌతిక పరిశీలనపై ఆరా తీశారు. ఆస్తుల మార్కెట్ విలువ లెక్కించి, ఇవ్వాలన్నారు. బుధవారం సాయంత్రం లోగా వ్యవసాయ భూములు మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భూములు మ్యుటేషన్ పూర్తయిన తర్వాత వేలం ప్రక్రియ చేపడతారని చెప్పారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, సీఐడీ డీఎస్పీ భూపాల్ ఉన్నారు.


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

విజయనగరం రింగురోడ్డు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా సంబంధిత శాఖ అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికలు తొలగించి, ట్రాక్టర్ల ద్వారా తరలింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువల్లో సజావుగా మురుగు సాగిపోయేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల అమృత్ పంప్‌హౌస్ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఫూల్‌బాగ్, రాజీవ్‌నగర్, దాసన్నపేట, గాజులరేగ, తోటపాలెం, బాలాజీనగర్, ప్రదీప్‌నగర్, రైల్వేస్టేషన్‌రోడ్, బ్యాంకు కాలనీ, బొత్సపేట, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా యాధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

డీలర్ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా జ్యోత్స్న

రాజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): డీలర్ల సంఘం అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా రాజాం మండలం అంతికాపల్లి గ్రామానికి చెందిన వాకముల్ల జ్యోత్స్న దేవిని, జాయింట్ సెక్రటరీగా రాజాం పట్టణానికి చెందిన లలితకుమారిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

రాజాం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి రుణపడి ఉన్నారని కార్మిక నాయకుడు రామ్మూర్తి నాయుడు తెలిపారు. సమస్యల సాధన కోసం 59 రోజుల పాటు చేసిన పోరాటానికి ప్రభుత్వం స్పందించి రూ.3వేలు వంతున వేతనాలు పెంచిందని ఆయన వెల్లడించారు. ఈమేరకు మంగళవారం రాజాంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇంజినీరింగ్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ నాగార్జునకు అభినందనలు

నెల్లిమర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ నూతన చైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్ మంగళవారం కలిసి, దుస్సాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకుడు ఆల్తి నల్లిబాబు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

చీపురుపల్లి, జులై 22 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టౌవ్‌లను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

శృంగవరపుకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు పలు సామగ్రిని వితరణ చేశారు. ఫ్యాన్‌లు, బ్లాక్ బోర్డులు, దోమల మేస్‌లను ఎమ్మెల్యే లలితకుమారి చేతులమీదుగా మంగళవారం ఆ పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. స్థానిక బ్రాంచి చైర్‌పర్సన్ పి.వరలక్ష్మి, సభ్యులు డి.సూర్యారావు, శ్రీనాథుల వెంకన్నబాబు, ఆశపు మల్లేశ్వరరావు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

నెల్లిమర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని బ్యాంకర్లు తెలిపారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ శ్రవణ్, డీసీసీబీ ఏఎం మూర్తినాయుడులు హాజరై అవగాహన కల్పించారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

భోగాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామంలోని ముత్యాలమ్మ, తోగాలమ్మ దేవతలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఆషాఢం సారె సమర్పించారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, అమ్మవార్ల వద్ద సారె ఉంచి, పూజలు చేశారు.



అమ్మవార్ల ముందు ఉంచిన సారె

వారంలోగా షాపులు ఖాళీ చేయాలి

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష

రాజాం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో షాపులన్నీ ఖాళీ చేయాలని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష. పట్టణంలోని కేర్ ఆసుపత్రి సమీపంలో గల వ్యాపారులకు ఆదేశించారు. మూసి ఉన్న షాపులపై నోటీసులు అంటించారు. మంగళవారం ఆమె దేవదాయ శాఖ ఈవోలు బీవీ మాధవరావు, పొన్నాడ శ్యామలరావు, సిబ్బందితో కలిసి కేర్ ఆసుపత్రి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. డోలపేటలోని ఉమామహేశ్వర లక్ష్మీనారాయణస్వామి దేవస్థానానికి చెందిన కోట్లాది రూపాయలు విలువచేసే భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి దేవదాయశాఖ ఆదాయానికి గండికొట్టారని ఆమె విలేకర్లకు చెప్పారు. డోలపేట ప్రాంతంలో నివాసగృహాల యజమానులతో కూడా చర్చించామని, దేవదాయ శాఖకు చెందిన భూముల్లో నిర్మించిన భవంతులను ఖాళీ చేయించాలని ఆయా భవంతుల్లో ఉన్నవారికి స్పష్టం చేశామని ఆమె తెలిపారు. వారం రోజుల గడువు తర్వాత షాపులు ఖాళీ చేయకపోతే పోలీసుల సహాయంతో తామే ఖాళీ చేయించి వేలంపాట నిర్వహిస్తామని ఆమె ప్రకటించారు. ఇదిలా ఉంటే ఇదే ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన ఓ షాపునకు తాళాలు వేసి సీజ్ చేశారు.

నిషేధిత జాబితాలో చేరిన ప్రాంతాల పరిశీలన

పట్టణంలోని నిషేధిత జాబితాలో చేరిన భూములు, భవనాలను దేవదాయశాఖ ఏసీ శిరీష మంగళవారం పరిశీలించారు. రాజాం మున్సిపాలిటీలోని సారధి రెవెన్యూ గ్రామ పరిధిలో గల రాణావీధి, కస్పావీధి, ఆశపు వీధి, అగ్రహారం వీధి తదితర ప్రాంతాలు నిషేధిత జాబితాలో చేరాయి. ఈ ప్రాంతంలో ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానం ఉండడంతో గతంలో ఆయా ప్రాంతాల భూములన్నీ నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ ప్రాంతాల్లో ఉమా రామలింగేశ్వర దేవస్థానానికి చెందిన ఆలయాలు, స్థలాల హద్దులను మున్సిపల్ సర్వేయర్ సత్యనారాయణతో గుర్తించారు. నిషేధిత జాబితాలో ఆస్తులు చేరినవారికి న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.



నిషేధిత జాబితాలో చేరిన భూముల వివరాలను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఏసీ శిరీష

నిరుపేదలకు సంజీవనిగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన రూ.3లక్షల 99వేల 827 విలువ చేసే చెక్కులను ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. రాజాం ఇందిరమ్మ కాలనీకి చెందిన బొంగు వెంకటరమణమ్మకు రూ.76,714, సత్యనారాయణపురానికి చెందిన వి.శ్రీనివాసరావుకు రూ.లక్షా 1128, సంతకవిటి మండలం మిర్తివలస గ్రామానికి చెందిన గంటా రవికుమార్‌కు రూ.లక్షా 27వేల 891, గోళవలసకు చెందిన వావిలపల్లి రమేష్‌కు రూ.94వేలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

- రాజాం అమ్మవారి కాలనీకి చెందిన వారణాసి స్పందన అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతోందని పలువురు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి, ఆమె కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజాం నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎమ్మెల్యేని కలిసి వారి సమస్యలు వివరించారు.

కూటమితో సంక్షేమం

- ఎమ్మెల్యే కళా

మెరకముడిదాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, ముదునూరు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళా

ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక

పూసపాటిరేగ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకుగాను 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొన్నారు. మండలంలో 10 రోజులపాటు జరిగిన తనిఖీల నివేదికలను ప్రజావేదికలో తెలిపారు. చాలా గ్రామాల్లో నిర్వహించిన పనులకు, అందజేసిన వేతనాలకు పొంతన కుదరలేదని గుర్తించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకం పారదర్శకంగా అమలు కావటానికి సామాజిక తనిఖీలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శారదాదేవి, సాట్ చైర్మన్ శ్రీకాంత్, ఎంపీడీవో రాధిక పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి

వ్యాపారులు సహకరించాలి

- ఎమ్మెల్యే లలితకుమారి
- విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిల్వకుండా చర్యలు

శృంగవరపుకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిల్వకుండా అధికారులు తీసుకోనున్న చర్యలకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో కలిసి, విలేకర్లతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఆక్రమణలను తొలగించాలన్నారు. అవసరమగు నిధులు తెచ్చే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఈ సమ స్య పరిష్కారానికి ఈనెల 28న జరిగే సమావేశానికి అధికారులు తాము తీసుకోనున్న చర్యలతో రావాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఎం.సతీష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో వీవీ అనురాధ తదితరులతో కలిసి విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైఎస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, నాయకులు కాపుగంటి వాసు, చెక్కా కిరణ్, వాకాడ బాలు, పెదగాడ అప్పలరాజు, బోనంగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వరదనీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

అన్ని హామీలు నెరవేరుస్తాం

శృంగవరపుకోట రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం పోతనాపల్లి గ్రామంలో పర్యటించి, సంక్షేమ పథకాలపై వివరించారు. టూరిజం కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి సుధారాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ సంతోష్‌కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ రమణాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

శృంగవరపుకోట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రుణపడి ఉంటామని ఎస్.కోట నియోజకవర్గ ఆర్యవైశ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు మంగళవారం పోతనాపల్లిలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కలిసి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే అదితి

విజయనగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నవారందరికీ రుణాలు మంజూరు చెసి, వారు ఆర్థికంగా ఏదిగేందుకు సహకరించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి అధ్యక్షతన విజయనగరం నియోజకవర్గ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత ఉన్నవారికి త్వరితగతిన రుణాలు అందచేయటమే కాకుండా, ఆ రుణాలను సద్వినియోగం చేసుకుని, జీవనోపాధి పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ, సూర్యఘర్, పీఎం విశ్వకర్మ పథకాలపై ప్రచారం కల్పించి అర్హులందరూ రుణాలు పొందే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, పశు సంవర్ధక శాఖ జేడీ వైవీ రమణ, మెప్మా పీడీ చిట్టిరాజు, పలు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

సీపీఐ(ఎంఎల్), అనుబంధ సంఘాలకు రాజీనామా

విజయనగరం టౌన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్)కి, అనుబంధ సంఘాలకు బెహరా శంకరరావు, మద్ది అప్పలరాజు తదితరులు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులకు అందజేశారు. 2007 నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేశామని, అయితే చాలాకాలంగా అంతర్గత సమస్యలపై విజయనగరం జోనల్ కమిటీకి, సమాంతరంగా పార్టీ నిర్మాణ పద్ధతికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగుతున్న విషయాన్ని అనేక సార్లు రాష్ట్ర కమిటీకి తెలియజేశామని తెలిపారు. అయినప్పటికీ సరిదిద్దే ప్రయత్నం చెయ్యకపోగా తమను అనేక ఇబ్బందులుకు గురిచేశారన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో కొనసాగే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా పార్టీకి, అనుబంధ ప్రజాసంఘాల సభ్యత్వాలకు రాజీనామా చేస్తూ పూర్తిగా వైదొలిగామని శంకరావు తెలిపారు.

జేవీవీ మహాసభలను విజయవంతం చేయండి

రాజాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు సెప్టెంబరు 13, 14 తేదీల్లో విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారని, వీటిని విజయవంతం చేయాలని జేవీవీ డివిజన్ శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 27వ తేదీన రాజాం డివిజన్ సభలు నిర్వహిస్తామని చెపాపరు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు అజశర్మ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జరజాన సీలయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

విజయనగరం దాసన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన నియోజకవర్గం మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26, 27వ తేదీలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల పునరుద్ధరణకు రూ.72లక్షలు

కొత్తవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండంలోని రెండు గ్రామాల్లో రామాలయాల పునరుద్ధరణకు దేవదాయ శాఖ రూ.72లక్షలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని కొత్తవలస పంచాయతీ మిందివలస రామచంద్రపురం గ్రామానికి చెందిన రామాలయం పునరుద్ధరణకు రూ.32లక్షలు, వీరభద్రపురం పంచాయతీ మునగపాకవానిపాలెం గ్రామంలోనున్న రామాలయం పునరుద్ధరణకు రూ.40లక్షలు మంజూరు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ నిధులు సర్వశ్రేయో నిధి నుంచి దేవదాయ శాఖ మంజూరు చేసినట్టు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారని ఆమె చెప్పారు. ఈసందర్భంగా ఆమె ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

- కేరళ మాజీ ముఖ్యమంత్రికి వామపక్ష నాయకుల నివాళి

నెల్లిమర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యుత్ స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి, నివాళులు అర్పించారు. హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

- గరివిడి: కేరళ మాజీ ముఖ్యమంత్రి, కామ్రేడ్ అచ్యుతానంద సేవలు అభినందనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అచ్యుతానంద సంతాప సభను నిర్వహిం చారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.
- విజయనగరం దాసన్నపేట: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనేత కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతికి స్థానిక అమర్ భవన్‌లో సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంతా ప సభ నిర్వహించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ లీజు గడువును పునరుద్ధరించండి

గరివిడి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ, గుర్ల మండలంలోని సదానందపురంలో ఉన్న మైన్‌ల గడువు ముగుస్తోందని, వాటిని పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చీపురుపల్లిలో గల ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. దేవాడ, సదానందపురం గ్రామాల్లో ఉన్న మైన్‌లలో గత 50 సంవత్సరాల నుంచి సుమారు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అయితే లీజు గడువు ముగుస్తున్నందున మైన్లు మూసివేస్తామని ఆయా యాజమాన్యాలు ఇటీవల ప్రభుత్వానికి నోటీసులు పంపించాయన్నారు. మైన్‌ల లీజు పునఃప్రారంభించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరునాయుడు, పిసిని అప్పలనాయుడు, రమణ, ఉత్తరావల్లి ప్రకాష్, కంది రామారావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మాయ మాటలు నమ్మి మోసపోయాం

శృంగవరపుకోట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం 2008 ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయామని జిందాల్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం బొడ్డవరలో సీపీఎం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. మార్కెట్ విలువ రూ.10 ఉన్న షేర్ మూడు సంవత్సరాల్లో వంద రూపాయలు అవుతుందని చెప్పారన్నారు. కేవలం ఎకరాకు రూ.2లక్షల 500 ఇతర చిన్నపాటి పరిహారాలు ఇచ్చి హరిజన, గిరిజన రైతులను మోసం చేశారని వాపోయారు.



బొడ్డవరలో మోకాళ్లపై నిరసన వ్యక్తంచేస్తున్న జిందాల్ నిర్వాసితులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వేణు(ఫైల్)

కొత్తవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈఘటనపై కొత్తవలస సీఐ సీహెచ్ షణ్ముఖరావు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస పంచాయతీ చీపురువలస గ్రామానికి చెందిన రంధి వేణు(22) సోమవారం తన స్కూటీపై అదే గ్రామానికి చెందిన మేడపురెడ్డి హేమంత్‌కుమార్‌ను వెనుక ఎక్కించుకుని తమ గ్రామం నుంచి వీరభద్రపురం గ్రామానికి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వెళ్తున్నాడు. వర్షంలో స్కూటీ అదుపు తప్పడంతో ఇనుప రైలింగ్‌ను ఢీకొన్నారు. రైలింగ్ రేకు వేణు మెడలో దిగిపోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న హేమంత్‌కుమార్‌కు తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించారు. వేణు బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. మృతుడికి తండ్రి వెంకటరమణ, తల్లి గోవిందమ్మతో పాటు చెల్లి హిమబిందు ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

దత్తిరాజేరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గల అప్‌లైన్‌లో గుర్తు తెలియన రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. లైట్ బ్లూ కలర్ నిక్కరు, తెలుపు, నలుపు, బ్లూ కలర్ అడ్డుగడుల టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9491813163, 8309901038, 9490617089 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

చోరీ కేసు ఛేదిస్తాం..

కొత్తవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి సొత్తును రికవరీ చేస్తామని కొత్తవలస సీఐ సీహెచ్ షణ్ముఖరావు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ చోరీకి పాల్పడింది మహారాష్ట్రకు చెందిన ముఠాగా గుర్తించామని చెప్పారు. ఈ ముఠాలో ఆరుగురు ముఠా సభ్యులు ఉన్నారని, వీరిలో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురిని పట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తమకు 90 తులాల బంగారం చోరీకి గురైనట్టు ఫిర్యాదు వచ్చిందని, అయితే రికవరీ తర్వాత ఇది ఫిర్యాదులో కంటే ఎక్కువా.. తక్కువా.. అనే వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. త్వరలోనే నిందితులను పట్టుకుని నూరు శాతం రికవరీ చేస్తామని తెలిపారు.

గృహ హింసపై కేసు నమోదు

సంతకవిటి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన గుణుపూరు గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త గంగులు, అత్త, మామలపై గృహహింస కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. తాపీ పనిచేస్తూ జీవనం కొనసాగించే తన భర్త గంగులు రోజూ మద్యం తాగి వచ్చి హింసిస్తున్నాడని గౌరీ తెలిపింది. ఇటీవల తన తలపై కొట్టాడని, అత్త, మామలతో కలిసి హింసిస్తున్నాడని ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోమొబైల్ షాపులో చోరీ

కొత్తవలస, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోనున్న ఆటోమొబైల్ ఇంజనీరింగ్ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో సుమారు రూ.20వేలు విలువ చేసే స్పేర్ పార్టులతో పాటు కొత్త టైర్లు చోరీకి గురైనట్టు షాపు యజమాని రామకృష్ణ తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ప్రకాష్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ ఘటనపై సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా

మెంటాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంద్ర నుంచి కుంభివలస వెళ్లే రహదారిపై మంగళవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఆంద్ర గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతకు వచ్చిన గిరిజనులు తిరిగి కుంభివలస వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. రహదారి పూర్తిగా పాడైపోయిన నేపథ్యంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

26న మెగా జాబ్‌మేళా

భోగాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజేరు మిరాకిల్ ఎడ్యుకేషన్ సొసైటీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 26న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఈ మేరకు ముంజేరు గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో 35 కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారులు భాస్కర్, ప్రశాంత్, మిరాకిల్ సీఈవో ప్రసాదు లోకం, పల్లంట్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు గుర్తింపు కార్డులు

పూసపాటిరేగ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీటీసీ సభ్యులకు ఎంపీడీవో కార్యాలయం వారు గుర్తింపు కార్డులను అందజేస్తున్నారు. గత మండల సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కాకుండా బయటవారు కూడా రావటంతో వాగ్వివాదాలు చోటుచేసుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై జనరల్ బాడీ సమావేశాలకు ఈ గుర్తింపు కార్డులు ఉన్నవారినే అనుమతించే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

వీధి పేర్లుతో బోర్డుల ఏర్పాటు

పూసపాటిరేగ, జూలై22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెర్ల సర్పంచ్ సంకాబత్తుల సత్తిబాబు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జనసేన పార్టీకి చెందిన ఈయన గ్రామంలో లింక్ రోడ్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే మండలంలో ఎక్కడాలేని విధంగా గ్రామంలో గల ప్రతివీధికి ఆ వీధిపేరు గుర్తించే విధంగా మంగళవారం బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కూడా ఈ-కామర్స్ సేవలు, లాజిస్టిక్ సేవలు పెరగటంతో చిరునామాలు తెలిసే విధంగా ఈ చర్యలు చేపట్టానని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాస్ చౌదరి

విజయనగరం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా వై.శ్రీనివాస్ చౌదరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో అసిస్టెంట్ కమిషనర్‌గా కృష్ణా జిల్లాలో విధులు నిర్వహించి, పదోన్నతిపై జిల్లాకు డీసీగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీసీ బాబ్జీరావు పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి డీసీగా విశాఖపట్టణం డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి వ్యవహరించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌చౌదరిని ఈఎస్ శ్రీనాథుడు, ఏసీ రామచంద్రరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లలో పార్కింగ్ చార్జీలు తగ్గించాలి

విజయనగరం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చార్జీలు విపరీతంగా పెంచేశారని, వాటిని సామాన్యులకు అందుబాటులో ఉండేలా తగ్గించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు.. వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బోరాకు మంగళవారం లేఖ రాశారు. ఇటీవల ప్రయాణీకులు తమను కలిసి వినతిపత్రం అందించారని చెప్పారు. ప్రయాణించే టికెట్ కంటే పార్కింగ్ చార్జీలే అధికంగా ఉన్నట్టు తన దగ్గర వాపోయారని తెలిపారు.

బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా రామారావు

విజయనగరం దాసన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ అధ్యక్షతన మంగళవారం నూతన జిల్లా పదాధికారుల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా మజ్జి రామారావును నియమించినట్లు వెల్లడించారు.

ఉత్తరాపల్లికి మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

చేరుకోవచ్చు. ఇందులో భాగంగా ఉత్తరాపల్లి గ్రామం వద్ద రింగ్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈరింగ్ రోడ్డు వద్ద మాత్రమే కటింగ్ ఉంటుంది. రింగ్ రోడ్డు దాటిన తరువాత మళ్లీ ఎక్కడా వేరే మార్గంలో వెళ్లేందుకు అవకాశం ఉండదు. అందుకే గ్రీన్‌ఫీల్డ్ పార్కును సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం ఉత్తరాపల్లి, రాయపురాజుపేట,దత్తి గ్రామ రెవెన్యూలోని రైతుల నుంచి 150 ఎకరాలను సేకరించారు.

● గ్రీన్‌పీల్డ్ హైవే కోసం సేకరించిన భూములకు సంబంధించి ఈ మూడు గ్రామ రెవెన్యూలో ఎకరాకు రూ.36 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించారు. రింగ్‌రోడ్డు కోసం సేకరించిన 150 ఎకరాలకు సంబంధించి సుమారు 50 మంది రైతులు తమ భూములకు మరికొంత ధరపెంచి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. మార్కెట్ రేటుకు ప్రభుత్వం ఇస్తున్న ధరకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. నష్టపరిహార ధరపై 30 శాతం మాత్రమే పెంచి ఇచ్చే అధికారం తనకు ఉందని చెబుతూ కలెక్టర్ 12 మంది రైతులకు ఎకరాకు ఇచ్చిన 36 లక్షల రూపాయలపై 30శాతం పెంచారు. దీంతో మిగిలిన 38 మంది రైతులు తమకు నష్ట పరిహారం పెంచాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆమోదం పొందిన వెంటనే పెంచిన నష్టపరిహారం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారని సమాచారం ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

● గ్రీన్‌పీల్డ్ హైవేలో ఉడా అప్రూవల్ పొందిన లే అవుట్ పోయిన వారికి చదరపు గజానికి రూ.6 వేలు చొప్పున పరిహారం అందజేశారు. ఎకరాలలో ఉన్న వారికి మాత్రం ఎకరా ధర ప్రకారం నష్ట పరిహారం ఇచ్చారు. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ పార్కుకోసం సేకరించిన భూములకు అదనపు పరిహారం అందిస్తున్నారు.

ఆరేళ్ల కిందటి ఇళ్లు.. అందని బిల్లులు

(ఐదో పేజీ తరువాయి)

5,186 ఇళ్లకుగాను రూ.15.52 కోట్లు చెల్లించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎందుకో మోక్షం కలగడం లేదు.

చివరి ఏడాదిలోనే పెండింగ్

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సబ్‌ప్లాన్ నిధుల నుంచి మరో రూ.70 వేల నుంచి లక్ష వరకూ అదనంగా మంజూరు చేసింది. అయితే 2017 వరకూ మంజూరైన ఇళ్లకు బిల్లుల చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. అటు తరువాత ఇంటి బిల్లుల చెల్లింపులో కాస్త జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. సమస్య చెప్పినా పట్టించుకోలేదు.

బిల్లుల పేరిట కలెక్షన్లు..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక నాయకులు చాలాచోట్ల కలెక్షన్ల పర్వానికి దిగారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయిస్తామని చాలా గ్రామాల్లో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే జగన్ సర్కారు నుంచి ఉలుకూపలుకూ లేకపోవడంతో లబ్ధిదారులు నిలువునా మోసపోయారు. అటు బిల్లులు రాక.. ఇటు నేతలకు కొంత వరకూ సమర్పించుకొని రెండింటికీ చెడ్డ రేవడిగా మారిపోయారు. జిల్లాలో ఎక్కువగా రాజాం నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో చెల్లింపులు ఉండిపోయాయి. అత్యల్పంగా విజయనగరం నియోజకవర్గంలో రూ.68 లక్షలు చెల్లించాల్సి ఉంది.

బడి ఎందుకు మానేసినట్టు?

(ఐదో పేజీ తరువాయి)

ఉండాలని చెప్పారు. అనంతరం ప్రాంతీయ సంచాలకుడు భాస్కరరావు మాట్లాడుతూ పిల్లలు ఆటలు ఆడుతున్నప్పుడు, అన్నం తిన్నప్పుడు కూడా ఉపాధ్యాయుడు దగ్గరగా ఉండాలని, అప్పుడే విద్యార్థికి నమ్మకం కలుగుతుందన్నారు. విద్యార్థి వారం రోజుల పాటు బడికి రాకుంటే ఎందుకు రాలేదని తల్లిదండ్రులను అడగాలన్నారు. తరగతి గదిలో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే వారు వెనుకబడి ఉన్నారన్న విషయం తరగతి గదిలో చెప్పకూడదన్నారు. అదే సమయంలో వారిపై అరవడం, కేకలు వేయడం చేయరాదన్నారు. ప్రేమతో దగ్గరకు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పదిఫలితాల్లో శతశాతం మార్కులు సాధించిన 25 మంది ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సన్మానించారు. సమావేశంలో డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు తదితరులు ఉన్నారు.

అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు బోల్తా

(ఐదో పేజీ తరువాయి)

రాజమండ్రి నుంచి బయలుదేరారు. మంగళవారం ఉదయం నుంచి బొర్రాగుహలు, అరకు, అనంతగిరి ప్రాంతాల్లో వున్న జలపాతాలను చూశాక సాయంత్రం రాజమండ్రికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆరు గంటల సమయంలో శివలింగపురం, టైడా మధ్యకు వచ్చేసరికి మినీ బస్సుకు బ్రేక్‌లు ఫెయిల్ అయినట్లు డ్రైవర్ కుమార్‌స్వామి గుర్తించారు. రోడ్డుకు ఒక పక్కలోయ, మరో పక్క కొండ ఉంది. బస్సు లోయవైపు లాగేస్తుండగా బస్సు ఆగకుండా చూసి మరోపక్క నున్న కొండను ఢీకొట్టాడు. దీంతో మినీ బస్సు బోల్తాపడింది. బస్సులో ఉన్న వారందరికీ సీట్లు, రాడ్లు, అద్దాలు తగిలి గాయపడ్డారు. కొందరికి తలకు తీవ్రగాయాలు కాగా మరి కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రమాదంపై శృంగవరపుకోట 108 వాహన ఉద్యోగులు ఎంఎస్ఎన్ మూర్తి, రమేష్‌కు సమాచారం అందింది. వీరు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకొని తీవ్రంగా గాయపడ్డవారిని శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఎస్.కోట నుంచి మరో 108 వాహనంలో మరికొందరిని తీసుకొచ్చారు. మిగిలిన వారిని అల్లూరి జిల్లా అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో తెచ్చారు. వీరందరికీ ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చికిత్స అందించారు. డ్రైవర్‌తో సహా 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ కుమార్ స్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

'ఓపెన్' అడ్మిషన్లు వేగవంతం చేయండి

సీతానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ ఎం.సుధాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన సమాచారంతో కూడిన గోడ పత్రికలను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనను వివరించి..



రాజుపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేటలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబీనాయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన మంచిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఈ సందర్భంగా రాజుపేట గ్రామస్థుడు బోను రవికుమార్ దిబ్బగుడ్డివలస-రాజుపేట రహదారి దుస్థితిని ఎమ్మెల్యే వివరించారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాజుపేట, సీతయ్యపేట, గుమ్మడివరం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. రోడ్డు మరమ్మతులకు త్వరలో చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వ్యవస్థలను స్వేచ్ఛగా పనిచేయనిస్తే అద్భుత విజయాలు

● ఆనందగజపతి జీవిత విశేషాలతో కూడిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు వ్యాఖ్య



మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతిరాజు జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గజపతి కుటుంబ సభ్యులు

మహారాణిపేట (విశాఖపట్నం), జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యవస్థలో శాస్త్రవేత్తలు, త్రివిధ దళాలను స్వేచ్ఛగా పనిచేయనిస్తే 'ఆపరేషన్ సిందూర్' లాంటి ఎన్నో విజయాలు సాధించవచ్చని గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. ఇతరుల కోసం పనిచేసే వారి జీవితాలు ధన్యమని, తన సోదరుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతి ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎంతో పరిణతి చెందిన తన సోదరుడి ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. ఆనంద గజపతిరాజు 75వ జయంతి సందర్భంగా ఆయన కుమార్తె పూసపాటి ఊర్మిళ గజపతిరాజు రచించిన 'ఆనందగజపతి జీవిత విశేషాల' పుస్తకాన్ని మంగళవారం విశాఖ మహారాణిపేటలోని ఒక హోటల్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులతో కలిసి అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తొలి క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆనంద గజపతిరాజు క్రీడల పట్ల ఆసక్తి తో క్రీడా స్థలాలపై తీసుకున్న నిర్ణయం ఎంతోమందికి మేలు చేసిందన్నారు. ఆయన అనేక ధార్మిక కార్యక్రమాలు కూడా చేపట్టి ఆదర్శనీయుడయ్యారన్నారు. తన తండ్రి గురించి ఊర్మిళ ఎంతో పరిశోధన చేసి పుస్తకం తీసుకురావడం మంచి ప్రయత్నమని అభినందించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చిన ప్రముఖుడు ఆనంద గజపతిరాజు అన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ఊర్మిళా తన తండ్రి గొప్పతనంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద గజపతి సతీమణి సుధా, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పార్వతీపురం మాజీ ఎంపీ ప్రదీప్ చంద్ర, వీరేష్ చంద్, విద్యాగజపతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం పడిగాపులు

గరుగుబిల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చినగుడబ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా, డీఏపీల కోసం మంగళవారం రైతులు పడిగాపులు కాశారు. రైతుసేవా కేంద్రాలకు తక్కువగా ఎరువులు కేటా యించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒక రైతుకు యూరియా, డీఏపీ ఒక్కో బస్తా ఇస్తుండటంతో ఆవేదన చెందుతున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

బొబ్బిలి రూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మండలంలోని కోమటిపల్లి విలేజ్ క్లినిక్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టీ, ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విధులకు సకాలంలో హాజరు కావాలని, విలేజ్ క్లినిక్‌లో ప్రజలకు మధుమేహం, సీజనల్ వ్యాధులకు సకాలంలో పరీక్షలు చేసి మందులు ఇవ్వాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

ముఖ హాజరుతో రేషన్ ఇవ్వండి

(ఐదో పేజీ తరువాయి)

పర్యవేక్షించాలన్నారు. మంగళవారం రాజాం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపరువైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలసంజీవని. పోషణ్ ట్రాకర్‌లు సమతుల్యంగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీకార్యకర్తలు లబ్ధిదారులకు రేషన్ పంచినపుడు తప్పని సరిగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా మాత్రమే చేపట్టాలన్నారు. సమావేశంలో రజనాదుర్గ, కళ్యాణి, నూకాలమ్మ, ప్రసన్న, జానకి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల రక్షణే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

కోసం జిల్లాలో ఐదు శక్తి టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలేజీల్లో యాంటీర్యాంగింగ్‌పై అవగాహన కల్పించనున్నామన్నారు. అనంతరం తాటిపూడి రిజర్వాయర్‌ను పరిశీలించారు. బోటులో ప్రయాణం చేసి రిజర్వాయర్ ఆవల ఉన్న ఎకో టూరిజం కాటేజీలను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

గిరిజన భూముల్లో 'పార్కు' వద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న మువ్వల

రామభద్రపురం, జూలై22 (ఆంధ్రజ్యోతి): కాకర్లవలస సమీపంలో నిర్మిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కును వేరే చోటకు తరలించాలని బొబ్బిలి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మువ్వల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గిరిజనులు సాగుచేసే భూముల్లో కాకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపట్టాలన్నారు. మంగళవారం ఆయన స్థానిక గిరిజనులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఎస్ఎంఈ పార్కుకి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగుచేస్తున్న భూముల్లో ఈ పార్కుకు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. జిల్లా అధికారులు గిరిజనులతో మాట్లాడి కోల్పోయిన భూములు, మొక్కలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేయకుంటే కాంగ్రెస్ పార్టీ తరఫున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నారసింహునిపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తికి కలంకం తెచ్చిన అలాంటి వారిని జైలుకు పంపించాలన్నారు. ఉపాధ్యాయుడు అస భ్యంగా ప్రవర్తించిన తీరును విద్యార్థినులు.. డిప్యూటీ డీఈవోకు తెలి యజేసినా చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని సాంబయ్య హెచ్చరించారు. పోలీసులు సూమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎస్‌జీ బృందం పర్యటన



కలవరాయిలో పర్యటిస్తున్న బృందం

బొబ్బిలి రూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి, కలవరాయి గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ) కేంద్ర బృందం పర్యటించింది. బృందంలోని వెంకటేశ్, హరిణి.. తడి, పొడి చెత్త సేకరణ, చెత్త సంపద కేంద్రంలో కంపోస్టు ఎరువుల తయారీలను పరిశీలించారు. ఇంకుడు గుంతల కోసం ప్రజల నుంచి సమాచారం రాబెట్టారు. ఇంకుడు గుంత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, సచివాలయ కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు

తపాలాశాఖలో ఇక ఆన్‌లైన్ సేవలు



సేవలను ప్రారంభిస్తున్న సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్

బొబ్బిలి, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఏపీతో సహా నాలుగు రాష్ట్రాలలో మంగళవారం నుంచి తపాలా శాఖలో అడ్వాన్స్ టెక్నాలజీ అమలు లోనికి వచ్చిందని బొబ్బిలి సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో మంగళవారం ఆన్‌లైన్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తపాలా శాఖలో ఆఫ్‌లైన్ సేవలకు పూర్తిగా స్వస్తి పలుకుతున్నట్టు ప్రకటించారు. ఇక మీదట అన్ని సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తామన్నారు. థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్ స్థానంలో తపాలాశాఖ సొంత సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకుందన్నారు. ప్రైవేట్ కొరియర్స్‌కు తీసిపోని రీతిలో ట్రాకింగ్ సిస్టమ్ అమలులో ఉందన్నారు. తపాలాశాఖలో పంపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, పార్శిల్స్ గమనాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా తెలుసుకునే అవకాశం ఇప్పుడు కలిగింది. రూ. 500 పైబడి విలువ చేసే వాటికి ఎటువంటి రుసుము వసూలు చేయకుండా పోస్టుమెన్ ఇంటికి వచ్చి పార్శిల్స్, రిజిస్టర్ పోస్టులను బుక్ చేస్తారన్నారు. రూ. 500 లోపు విలువ ఉన్న వాటికి రూ.50 సేవా రుసుము వసూలు చేస్తామన్నారు. బొబ్బిలి ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో బొబ్బిలి, బలిజిపేట, సీతానగరం, గరుగుబిల్లి మండలాల్లో మొత్తం 73 రూరల్ పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. వాటి పరిధిలోనూ ఆన్‌లైన్ సేవలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో హెడ్ పోస్టుమాస్టర్ రాధ, సిస్టమ్ ఇంజనీర్ గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, హెచ్ఎంలకు సత్కారం



ప్రిన్సిపాల్, హెచ్ఎంలను సత్కరిస్తున్న కలెక్టర్

బొబ్బిలి రూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మండలంలోని కారాడ (కోమటిపల్లి) ఎంజేపీ పాఠశాల, పక్కి జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులను కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ అంబేడ్కర్ సత్కరించారు. ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోది, పక్కి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జేవీవీఎస్ఎన్ రాజును ఆయన సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్జేడీ, డీఈవో ఉన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అచ్యుతానందన్ చిత్రపటానికి సీపీఎం నాయకుడు పి.శంకరరావు పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అచ్యుతానందన్ విద్యార్థి దశ నుంచే వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలపై భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. కష్టజీవుల పక్షపాతిగా చివరిదాకా పోరాడారన్నారు. ఆయన మృతి పార్టీకి, పేదలకు లోటు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గోపాలం, ప్రసాద్, లక్ష్మి, యుగంధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో మరో నాలుగు చెక్ పోస్టులు



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ ఏఈఎస్‌లు

పార్వతీపురం టౌన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టులతో పాటు మన్యం జిల్లాలోని ఆర్.కె. బట్టివలస, మరికి, రాధమ్మపేట, విక్రంపురం గ్రామాల పరిధిలో తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సారా రవాణాను అరికడతామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌లు ఎ.సంతోష్, జీవన్ కిశోర్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆరు మన్యం జిల్లా కేంద్రంలోని పాత రెల్లివీధి, ఇందిరా కాలనీలో సిబ్బంది మెరుపుదాడులు నిర్వహించారు. దాడుల్లో పాతరెల్లివీధి, ఇందిరాకాలనీలో సారా నిల్వలతో పాటు సారా ప్యాకెట్ల తయారీదారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి పాతరెల్లివీధిలో డి.సోకు, సుజాత, అమరనాథ్ వద్ద నుంచి 120 సారా ప్యాకెట్లు, ఇందిరా కాలనీలో సారా ప్యాకెట్లను తయారు చేస్తున్న ఎస్.వినోద్, సుమలత నుంచి 100 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐదు గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మన్యం జిల్లాలో 137 అమ్మకాలు జరిగే గ్రామాలు ఉన్నట్లు గుర్తించామని, నవోదయం ద్వారా ఇప్పటికే 119 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చామన్నారు. జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన 45 మందిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే గుమడ గ్రామానికి చెందిన ఆర్.వినోద్‌పై పీడీ యాక్టు విధించామని వారు తెలిపారు.